విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 19, ఏప్రిల్ 2025 | 8 పేజీలు



ప్రజల మనోభావాలతో ఆటలా..

- ఇకనైనా టీటీడీపై రాజకీయాలు ఆపండి
- రాజకీయ పార్టీల నేతలకు ఇది తగదు
- నాయకులకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు

విశాలాంధ్ర-తిరుపతి: టీటీడీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అటువంటి చోట రాజకీయాలు తగదని వివిధ రాజకీయ పార్టీలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు పలికారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసి లబ్ధిపొందేలా పరస్పర ఆరోపణలకు ఇక ఫుల్ స్టాప్ పెట్టాల్సిందిగా ఆయన కోరారు. శుక్రవారం తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గోశాల విషయాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవద్దని, అందుకోసం తాను చేతులు జోడించి కోరుతున్న నేతలకు ఈ సందర్భంగా సూచించారు. హైడ్రామాలు సృష్టించి భక్తుల మనోభావాలతో దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని, టీటీడీపై ఇంతటితో రాద్ధాంతం మానుకోవాలని హితవు పలికారు.

వార్త మెయిన్‌లో

కళ్యాణ కట్టలో టీటీడీ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - తిరుమల: శ్రీవారికి భక్తులు తలనీలాలు సమర్పించే కళ్యాణ కట్ట, నందకం మినీ కళ్యాణ కట్టల్లో శుక్రవారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భక్తుల తలనీలాల సమర్పణను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్షురకుల ప్రవర్తనపై అభిప్రాయాలను భక్తుల నుండి తెలుసుకున్నారు. ఒక ప్రాంతంలోని కళ్యాణకట్టలో రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీ తక్కువగా ఉండే కళ్యాణకట్టకు భక్తులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.కళ్యాణకట్టను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా సేవాభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ శాంతా రామ్, శ్రీ నరేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూమన కరుణాకరరెడ్డిపై కేసు నమోదు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: టీటీడీ ఎస్వీ గోశాలలో గోవుల మృతిపై గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతూనే ఉంది.తొలుత టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియా సమావేశంలో టీటీడీ తిరుపతి గోశాల గోవధ శాలగా మారిందంటూ ఆరోపణలు గుప్పించారు.మూడు నెలల కాలంలో 100 గోవులు మృతి చెందాయని చెప్పారు.అదే రోజు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి, భూమన ఆరోపణలు అవాస్తవమని ఖండించారు.

వార్త మెయిన్‌లో

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయండి

- ఇ -చెక్ అనే థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ను స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంగా ప్రకటించిందని,ఈ మాసం మూడో శనివారం పారిశుద్ధ్యం పరిశుభ్రతను పెంపొందించేందుకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ను అందరి భాగస్వామ్యంతో విజయ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి మాసం మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓల కు తమ దిశా నిర్దేశం చేశారు.

2లో

వార్త మెయిన్‌లో

స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో 139వ మే డేని జయప్రదం చేయండి

- కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనండి - నారాయణ పిలుపు

తప్పిన పెను ప్రమాదం

- అగ్గిపెట్టెల లారీ బోల్తా

7లో

ఆయుష్మాన్ సిహెచ్ఓ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-పలమనేరు: ఆయుష్మాన్ సిహెచ్ ఓ సమస్యలు పరిష్కరించాలని రూరల్ మండలంలోని కోలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఉదయం వైద్య ఆరోగ్య శాఖలో ఎన్ హెచ్ ఎం కింద సిహెచ్వోలుగా పనిచేస్తున్న వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తూ గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. గత ఆరు సంవత్సరా లుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించలేదన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పిం చాలని. ఎస్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరిం చాలని సిపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు. క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని ఎఫ్ ఆర్ ఎస్ నుంచి సిహెచ్ లను మినహాయింపు ఇవ్వాలన్నారు. హెచ్ ఆర్ ఏ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్ఫర్ పితృత్వ సెలవులు వంటివి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాలు తర్వాత రెగ్యులర్ చేయాలన్నారు. అదేవిధంగా 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నామన్నారు. 2023లో ఎన్ హెచ్ ఉద్యోగులందరికీ 23% వేతన సవరణ ఇచ్చినప్పటికీ అప్పుడు తమకు వేతన సవరణ చేయకపోగా ప్రతినెల ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు ఇవ్వడంలో జాప్యం వల్ల తాము కుటుంబాలు ఆర్థికమైన ఇబ్బందుల్లోకి వెళ్లిపోయామన్నారు అలాగే 2023 జూలై నుంచి ఆన్లైన్ విధానంలో చెల్లింపులు జరిపిన పి.బి.ఐ లో ఉన్నటువంటి అవగతవకలు వలన తాము చాలా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల వైద్యాధికారి కి అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా ప్రతి మాసం ఒక ఇతివృత్తంతో కార్యక్రమాల నిర్వహణ చేపట్టడం జరుగుతున్నదని, ఏప్రిల్ మాసంలో మూడవ శనివారం ఇ -చెక అనే ప్రధాన అంశం గాకార్యక్రమాలు నిర్వహించాలనన్నారు. ఇ-చెక్ అంటే అని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలలోని ఇల్లు దుకాణాలలో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పూర్తిగా సేకరించి రీ యూస్ చేయడం. ఇందుకు షాపులు, ఇళ్లల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వేస్ట్ ను పూర్తిగా సేకరించాలనన్నారు. ఈ వేస్ట్ ని సేకరించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందనన్నారు.మన రోజు వారీ జీవితంలో స్వచ్ఛత అనేది భాగం కావాలనన్నారు. ఇ చెక్ అనే అంశం నకు సంబంధించిన పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామ,వార్డు సచివాలయ పరిధిలో ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం తో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శాఖ లో స్వర్ణ ఆంధ్రహ స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమాలను నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన వివరాలను స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

విశాలాంధ్ర-చంద్రగిరి: మహిళల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలుగు దేశం పార్టీ మహిళా నాయకురాలు పులి వర్తి సుధారెడ్డి అన్నారు. చంద్రగిరి మండలంలోని శానంబట్ల, పిచ్చి నాయుడు పల్లి గ్రామపంచాయతీలలో శుక్రవారం ఉదయం జరిగిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తమ గ్రామానికి విచ్చేసిన సుధా రెడ్డి కి స్థానిక మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. పంచాయతీలోని కూటమి నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యక్రమానికి విచ్చేసిన మహిళలను ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం. అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే అభివృద్ధి పథంలో నియోజకవర్గం ముందుకు సాగుతోందని, పార్టీలకు సంబంధం లేకుండా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అఖండ దృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ఆమె అన్నారు. ఎనిమిది నెలల్లో పంచాయతీలలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. గత ప్రభుత్వంలో చంద్రగిరి నియోజకవర్గంలో 60 వేలకు పైచిలుకు ఉన్న దొంగ ఓట్లను తొలగించేందుకు మేము మా కార్యకర్తలు ఒక యుద్ధమే చేసాము. ఎన్నికల సమయంలో మా పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారు. వారి సేవలను అభినందిస్తూ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తెలివైన మంచి నిర్ణయం తీసుకున్నారు, ఉచితాలకు లొంగకుండా అభివృద్ధిని కోరుకున్నారు. మహిళల నిర్ణయమే తుది నిర్ణయం. మహిళల మద్దతుతోనే పులివర్తి నాని ఘన విజయం సాధించారు. మమ్మల్ని ఆదరించినందుకు చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, ప్రత్యేకించి మహిళలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ రూ. 1000 పెంచుతామని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల పాటు కొద్ది కొద్దిగా పెంచుకుంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కసారిగా రూ. 1000 పెన్షన్ పెంపు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి దీనిని బట్టి మీరు అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. ఉచిత గ్యాస్ కు సంబంధించి బ్యాంకులో ఆధార్ లింక్ అయి ఉండాలి. గ్యాస్ కనెక్షన్ వారి దగ్గర ఆధార్, అకౌంట్ రెండు గ్యాస్ కనెక్షన్ కు లింక్ అయి ఉండాలి. ఎవరికైనా ఉచిత గ్యాస్ డబ్బులు పడకపోతే వీటిని చెక్ చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఉచితంగా అందిస్తున్న టైలరింగ్, డిజైనింగ్, అగర్‌బత్తి, కర్పూరం, పేపర్ ప్లేట్, మొబైల్ రిపేరింగ్ వంటి స్వయం ఉపాధి శిక్షణ పొందడంతో మహిళలు స్వతంత్రంగా సంపాదిస్తూ, కుటుంబం మరియు సమాజంలో గౌరవంగా జీవించేందుకు సహాయపడతాయని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. గత ఐదు ఏళ్లుగా వాయిదా పడిన చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయ నిర్మాణాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని బాధ్యతలు చేపట్టిన వెంటనే భూమిపూజ చేసి, ఆధునిక ప్రణాళికతో వేగంగా ప్రారంభించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల భద్రత కోసం శక్తి యాప్ తీసుకొచ్చినట్లు డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని కోరారు. మహిళలు పంచాయతీలోని సమస్యలు అండర్ డ్రైనేజ్, వాటర్ ట్యాంకుల శుభ్రం, ఇంటి పట్టాలు, సీసీ రోడ్లు వంటి అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన సుధా రెడ్డి త్వరలోనే వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా అందించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని పంచాయతీలను అభివృద్ధి పరిచేందుకు కూటమి ప్రభుత్వం ముందుగా మహిళల ఆర్థికంగా ఎదుగుదలకు పెద్దపీట వేస్తుందని ఆమె పేర్కొన్నారు. మమ్మల్ని ఆదరించిన ప్రతి ఒక్కరికి మరోసారి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జల జీవన్, స్వచ్ఛభారత్, ద్వారా పంచాయతీ సందర్శన

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రం పంచాయితీని జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, కేంద్ర బృందంలచే శుక్రవారం సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా కేంద్ర బృందంలోని సభ్యులు బైరెడ్డిపల్లి పంచాయతీ,బైరెడ్డిపల్లి కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ, మహమ్మదీయ వీధి,బీసీ కాలనీలలో ని నీటి కుళాయిల ద్వారా పంపిణీ జరుగుతున్న విధానాన్ని స్వయంగా చూసి, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద కొత్తగా నిర్మించినటువంటి నీళ్ల ట్యాంకు జల జీవన్ మిషన్ ఒహెచ్ఎస్ఆర్ ద్వారా నిర్మించబడ్డది, కేంద్ర బృందం ఈ నీళ్ల ట్యాంకును పరిశీలించడం జరిగినది. దీని ద్వారా పంచాయతీలోని పేదలకు ఉచితంగా నీళ్ల కొళాయిల కనెక్షన్లను ఇవ్వవలసి ఉన్నది,

కేంద్ర బృందం పంచాయతీ ట్యాంకు సమీపం లోని అన్ని ఇళ్లను పరిశీలించి తమ కెమెరాలలో చిత్రాలను తీసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామపంచాయతీ త్రాగునీరు పారిశుద్ధ్య కమిటీ మరియు ప్రజలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా త్రాగునీటి ట్యాంకు ద్వారా అందిస్తున్న నీటిని ఫ్లోరైడ్, క్లోరైడ్,క్లోరినేషన్ టెస్టులను అందరి సమక్షంలో కమిటీ సభ్యుల ద్వారా చేయించి,అందుతున్న నీరు స్వచ్ఛమైనదిగా తెలియజేశారు. గ్రామ పంచాయతీలోని రికార్డ్స్,రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జల జీవన్ మిషన్ స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం నేషనల్ వాష్ ఎక్స్పర్ట్ అధికారి అన్బు అలగన్, నరేంద్ర, రాజేంద్ర బాలాజీ, స్టాలిన్, లోకనాథం, సర్పంచ్ వెంకటేశు, పంచాయితీ కార్యదర్శి సదాశివయ్య, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ బాలసుందరం, బైరెడ్డిపల్లి పెద్దపంజాణి లు సురేష్ బాబు,సుధాకర్ పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి ఉచితంగా నీటి సరఫరాను చేసే పథకాన్ని ప్రవేశపెట్టినది, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఉన్నది, కానీ ఇంతవరకు మండలంలో అమలు జరపలేదు. రెండు రోజులకు పూర్వం పలుచోట్ల నీళ్లు అందక మండలంలోని ప్రజలు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు,ఇది జరిగిన రెండు రోజులకే కేంద్ర బృందం సందర్శనార్థం రావడంతో అధికారులలో చలనం మొదలయ్యింది. కేంద్ర బృందం రాకతో మండలంలో ఆశించదగ్గ మార్పు జరిగి అందరికీ త్రాగునీరు అందుబాటులోకి రావాలని మండల ప్రజలు ఆశాభావాన్ని వ్యక్త పరుస్తున్నారు.

షెకీనా చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి కెబి లేఅౌట్ లోని షెకీనా చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థన సీనియర్ పాస్టర్. అరుల్ అరసు, పాస్టర్. జోయల్ ఆధ్వర్యంలో జరిగిన గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ఘనముగా జరిగింది. మానవాళి పాప విమోచన కొరకు కల్వరి సిలువలో ప్రాణ త్యాగం చేసిన యేసుక్రీస్తును స్మరించుకుంటు, క్రీస్తు సిలువలో పలికిన అమూల్యమైన ఏడు మాటలను ఏడుగురు వ్యక్తులు ప్రసంగించారు. క్రీస్తు చూపిన ప్రేమ, క్షమాపణ, కనికరము, దయ, జాలి మహోనతమైన దని, మనుషులందరిలో క్రీస్తు చూపిన ప్రేమ మార్గములో నడవాలని తెలిపారు. వందలాది మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టోఫర్ సామ్యూల్, జెర్మియా, మోషే, సుసన్, హిప్సిబా, జెస్సీ, దెబోరా పాల్గొని సిలువలో పలికిన ఏడు మాటలు గూర్చి బోధించిరి.

ఘనంగా అమరావతి హాస్పిటల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని చర్చి వీధిలో ఉన్న అమరావతి హాస్పిటల్ 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య , డాక్టర్ నిర్మల మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా తమ ఆసుపత్రి నందు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్ నందు కిడ్నీ వ్యాధి గ్రస్తుల కు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు షుగర్ వ్యాధిగ్రస్తులకు, ఆర్థోపెడిక్ రోగులకు విశేష అనుభవం ఉన్న డాక్టర్ల చే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్ నందు ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించామ న్నారు. హాస్పిటల్ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలిపారు. అనంతరం పలువురు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల దంపతులను ఘనంగా సన్మానించారు.

గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఇందిరా నగర్‌లో గడ్డి వాము దగ్గమైన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ కథనం మేరకు గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శీనయ్య అనే వ్యక్తి కి చెందిన గడ్డి వాము దగ్గమైందన్నారు. బాధితుడు ఆకతాయిలు అగ్గిపుల్ల వేయడంతో ఈ సంఘటన జరిగిందని తెలిపారు అన్నారు. సుమారు 850 గడ్డిమోపులు కాలిపోవడం జరిగిందన్నారు. సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది ద్వారా మంటలను ఆర్పివేయడం జరిగిందన్నారు. సుమారు 40 వేల రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

అభివృద్ధివైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరుగులు

సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

విశాలాంధ్ర- సత్యవేడు: విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నట్టు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తు చేశారు. శుక్రవారం మండల పరిధిలోని చమర్తకండ్రిగ, మోటుపాల్యం ఎస్టి కాలనీలో పలు సిమెంటు రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. ముఖ్యఅతిథులుగా టిడిపి మాజీ అధ్యక్షుడు పరమశివం, పిచ్చాటూరు ఇలంగోవన్, బద్దురాజు, మండల పరిషత్ ఏఈ ఇబ్రహీం ఖాన్, పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డి, హౌసింగ్ ఇంచార్జ్ ఏఈ భాను ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇదేగాక పాడి రైతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో పాడి రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పశు వుల షెడ్లను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్నట్టు ఆయన చెప్పారు. తదనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్థానిక నేతలతో కలిసి మోటుపాల్యంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో 120 మీటర్ల మేర నిర్మించిన సిమెంట్ రోడ్డుకు, చమర్తి కండ్రికలో 10 లక్షల రూపాయల భయంతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శశిమోహన్ నాయుడు, మురళి (చికెన్ చిన్న), ధన శేఖర్, తులసిరామ్, గుర్రప్ప, స్థానిక నాయకులు పివిఎస్ఆర్ సుబ్రహ్మణ్యంరాజు, చంద్రమౌళి, ఉమా శంకర్రాజు, హరినాథ శెట్టి, నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత పోలేరమ్మ జాతర

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేటలో మే నెల 6, 7 తేదీల్లో జరిగేటటువంటి నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర యొక్క కార్యక్రమాలు ముమ్మరంగా జరిగినాయి. బేరిపేటలో మహాలక్ష్మమ్మ గుడి దగ్గర తాంబూలాలు సమర్పించినారు. నాయుడు పేట జాతర కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు సమక్షంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్‌చైర్మన్ 786 రఫీ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నెలవలను కలిసిన దళిత నాయకులు

విశాలాంధ్ర-నాయుడుపేట: దళితుల ఆశాజ్యోతి, దళితుల కోసం నిరంతరం శ్రమించే యోధుడు సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ మరియు మండల ఎస్సీ అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు కలవడం జరిగింది.

వక్ఫ్‌బోర్డ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం యువత నిరసన

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని ఇందిరా సర్కిల్లో పట్టణంలోని మైనార్టీ యువత అధిక సంఖ్యలో శుక్రవారం రోజున పార్లమెంట్లో కొత్తగా చేసిన వక్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని నిరసన తెలుపడం జరిగింది కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేయడం జరిగింది ఈ సందర్భంగా మైనార్టీ యువత మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి ముస్లింలపై వివక్ష చూపుతూ సమాజంలో వారిని అణగదొక్కాలని చూస్తున్నారన్నారు అందుకనే మా చట్టాలన్నిటిని మారుస్తూ మా హక్కులను కాలరాస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులంతా ఉద్యమిస్తున్న ప్పటికీ మా మనోభావాలను పట్టించుకోకుండా ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యంగా బిజెపి మొండి వైఖరితో పార్లమెంట్లో వక్కు సవరణ బిల్లు పెట్టి పాస్ చేయడం జరిగిందన్నారు ఇది సమాజంలో ఎంతవరకు సమంజసమని మేము నిలదీస్తున్నామన్నారు. దేశంలో ఉన్న ప్రజలంతా పాలకులకు ఒకటిగానే ఉండాలి గాని మతాలను విభజిస్తూ కొన్ని మతాలను సమాజంలో లేకుండా చేయాలని చేస్తున్నారన్నారు. ఇదేవిధంగా మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని వారు తెలిపారు.

ఎమ్మెల్యేచే చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-తిరుపతి: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. తొమ్మిదవ డివిజన్ కు చెందిన సంజయ్ గాంధీ కాలనీ కి చెందిన జె. మునీంద్రా కు ఆస్పత్రి ఖర్చుల కింద నలభై ఎనిమిది వేల మూడు వందలా ముప్పయ్ మూడు రూపాయలను ఆయన అందించారు. అలాగే జీవకోనలోని రాజీవ్ నగర్ కు చెందిన ఎం. ఆదెమ్మకు రెండు లక్షల 21వేల 260 రూపాయలను ఎమ్మెల్యే అందించారు. అనారోగ్యంతో చికిత్స పొందిన పేదలకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు సిఎంఆర్ ఎఫ్ కింద ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, జీవకోన సుధాకర్, శిరీషా, బాబ్జీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పియండిఎస్ విత్తనాలు

విశాలాంధ్ర-దక్కిలి: దక్కిలి మండలం డి ఉప్పరపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన సిబ్బంది రైతులు తమ పంట పొలా లలో పిఎండిఎస్ పంటలకు చెందిన విత్తనాలను అందుబా టులో ఉన్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విభాగ ఎంసి ఆర్పి శేషం పెంచలయ్య మాట్లాడు తూ వేసవిలో సాగు చేయడానికి అందుకు 02813114 ఎంఎస్ సంబంధించిన సుమారు 20 రకాల విత్తనాలను కలిపి 50 విత్తన బ్యాగులను సిబ్బంది తయారు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా దక్కిలి మండలం డి ఉప్పరపల్లి యూనిట్లో పిఎండిఎస్ విత్తనాలను రైతులకు అందుబాటులో ఒక్కొక్క బ్యాగ్ 900 రూపాయలు అని దక్కిలి మండల వ్యవసాయ విభాగ ఎంసిఆర్పి శేషం పెంచలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుహర్లత, ఎం.సి.ఆర్. పి.ఎస్ పెంచలయ్య, యల్ 2 రజని మరియు కవిత, యల్ 3 నారాయణ, మరియు ఆ గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రభారతిలో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-గూడూరు : గూడూరు రెండవ పట్టణం లోని మాళవ్య నగర్‌లో ఉన్న శ్రీ స్వర్ణాంధ్ర భారతి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, తల్లిదండ్రులకు పాదాభివందనం కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ దశ నుంచే తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని చదువులపై ఆసక్తిని పెంపొందించేలా శ్రీ స్వర్ణాంధ్ర భారతి పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసి, వేద పండితుల యొక్క సహచర్యంలో విద్యార్థులు తమ తల్లులకు పాదాభివందనం చేసి,గౌరవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం నవకోటి నాయుడు. పాఠశాల డీన్, సి.డి.సునీల్ రాజ్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె.హరికృష్ణ, ప్రైమరీ ఇన్ - చార్జ్ సి.హెచ్. సింధు,విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ నిర్వాహకునిపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం బలరాం థియేటరు వీధిలో శ్రీ నెట్ కేఫ్ సెంటర్లో నిర్వాహకునిపై ఓ మహిళ శుక్రవారం ఫిర్యాదు చేశారు. శ్రీ నెట్ కేఫ్ నిర్వాహకులు యువతకు నీలి చిత్రాలు చూపుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని సదరు మహిళ పోలీసులకు తెలిపింది. జిరాక్స్ కోసం తాను శ్రీ నెట్ కేఫ్ సెంటరుకు వెళ్లగా నిర్వాహకులు యువతకు నీలి చిత్రాలు చూపుతున్నట్లు గుర్తించానన్నారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదని చెబితే వారు తనపట్ల దురుసుగా ప్రవర్తించార న్నారు. దీంతో తాను 100కి డయల్ చేయడంతో శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ పోలీసులు వచ్చారన్నారు. జరిగిన ఘటన గురించి పోలీసులకు తెలియచేయడంతో... నిర్వాహకుని అదుపులోకి తీసుకున్నారని సదరు మహిళ తెలియచేసింది. యువతను తప్పు దోవ పట్టిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు.

ఘనంగా ఆరణి శివ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి: ఆరణి శివ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శివ పుట్టిన రోజు సందర్భంగా శుక్ర వారం ఉదయం రుయా ఆస్పత్రి వద్ద జనసేన పార్టీ నాయకుడు రుయా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బండ్ల లక్ష్మీపతి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో శివ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహాచ్చారి, రాజా రెడ్డి, హెచ్ డి ఎస్ సభ్యులు లక్ష్మీపతి రాయల్, అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి, హేమకుమార్, కొండా రాజమోహన్, సుమన్, ఆముదాల వెంకటేష్, బాలిశెట్టి కిషోర్, జీవకోన సుధా తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాలం అభిషేక పూజలు ఉచిత అన్నదానం

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం నందు ఆనవాయితీ ప్రకారం ప్రతి శుక్రవారం అభిషేక పూజలు నిర్వహించుట ఆనవాయితీ పూజలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. పూజలు చేసిన ఎడల దోషాలు తొలగుతాయని మంచి జరుగుతుందని భక్తుల అభిప్రాయం నమ్మినవారికి గంగమ్మ తల్లి అన్ని విధాల మేలు చేస్తుందని భక్తులు పూజలో పాల్గొంటారు భక్తులకు ఆలయ ఈవో ఏకాంబరం తీర్థప్రసాదాలు అమ్మవారి పసుపు గాజులు భక్తులకు అందజేశారు వేద పండితులచే ఆశీర్వాదాలు అందించారు భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు అధిక సంఖ్యలో కర్ణాటక ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాల నుంచి తరలివచ్చారు ఈ కార్యక్రమంలో వేద పండితులు గోవర్ధన్ అర్చకులు గంగిరెడ్డి కృష్ణప్ప సుధాకర్ దాము వశిష్ట రాజన్న బాబు చిన్న గంగిరెడ్డి కృష్ణప్ప చంద్ర ప్రసాద్ హరి సిబ్బంది రామనాథం సుధాకర్ రెడ్డి కృష్ణారెడ్డి తాతయ్య ముని రాజా మంజునాథ్ దొరస్వామి విజయ్ కుమార్ సూరి గంగాధర్ చలపతి మనీ రమణ వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

జిల్లా డ్వామా పిడి రవికుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు రవికుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఉపాధి హామీ పథకం మరియు ఉద్యాన శాఖలు సంయుక్తంగా జిల్లాలో ఐదువేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. మామిడి, జామ, కొబ్బరి, దానిమ్మ, అల్లి నేరేడు, చింతకాయ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, మొదలైన రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు అలాగే పూల సాగు మల్లె రోజా ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క చిన్న సన్నకార రైతులు ప్రతి ఒక్కరు పండ్ల తోట పెంపకంకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.మండల పరిధిలోని ఉపాధి హామీ పథక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో అందుబాటులో ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క రైతు ఈ నెల చివరిలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

ప్రబంధకారణి కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో నూతన ప్రబంధకారిణి కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు గల్లా సురేష్, కార్యదర్శి రవికుమార్ పాఠశాల నూతన కమిటీసభ్యులతో ప్రమాణ స్వీకారంచేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు కొనసాగు తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి ఈ కమిటీ సహకారం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మంగిరెడిప్ప, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాశంకర్, ప్రకాష్, సోమశేఖర్ రెడ్డి, పద్మావతి, పుష్పలత, డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజేష్, నాగేశ్వరరావు, కమిటీసభ్యులు, మాతాజీ (ఉపాధ్యాయురాలు) పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని వెలం పాళెం లోని సీతా రామ మందిరంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం నాటితో ముగిశాయి. ఈ నేపథ్యంలో మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వీధిలోని చిన్నారులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఉల్లాసం గా గడిపారు. ప్రతి ఇంటి వద్ద పసుపునీళ్లను పెట్టారు. దీంతో చిన్నారులు వాటినిఒకరిపై ఒకరు పోసుకున్నారు. అనంతరం మందిరంలో పూజలు నిర్వహించి భక్తులు, చిన్నారులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణనందు జీడి నెల్లూరు ఎమ్మెల్యే, విప్ డాక్టర్ ఎంవీ థామస్ స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపి డీవో చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ కార్యక్ర మాన్ని ప్రభుత్వ అధికారులు సర్పంచ్ ఎంపిటిసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని ఎస్.ఎ.ఎల్.సి చర్చి, పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘం, సార్వత్రిక ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే సందర్భం గా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పూర్వము 2025 సంవత్సరల క్రితం ఇదే రోజు అబద్ధపు తీర్పు నిచ్చిన నేరా ఆరోపణ లతో ఏసు ప్రభువుకి శిలువ వేయాలని రాజు ఆదేశించారు. మానవాళి పాపం కొరకు ఏసు ప్రభు శిలువ తో మరణించాడని, క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను శుభశుక్రవారంగా ఆచరిస్తారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు గీతాలు ఆలపించి దైవ సందేశం అందించారు.

ట్రాక్టర్ కింద పడి హైస్కూల్ విద్యార్థి మృతి

విశాలాంధ్ర-దక్కిలి: దక్కిలి మండలంలోని దేవలపల్లి గ్రామానికి చెందిన శోక పెంచలనరసయ్య కుమారుడు శోక పార్థు (12) డి వడ్డీపల్లి హై స్కూల్ నందు ఆరవ తరగతి చదువుతున్నాడు. పార్థు మధ్యాహ్నం హైస్కూల్ నందు మిడ్ డే మీల్స్ జరుగుతున్న సమయంలో స్కూల్ బయటకు వచ్చి దేవలపల్లి గ్రామానికి చెందిన బాబు ట్రాక్టర్ ఏపీ 26 టిడి 6075 ఎక్కి దేవులపల్లి గ్రామానికి వెళ్లే మార్గం మధ్యలో ట్రాక్టర్ చక్రాలు కింద పడి చనిపోయాడని గ్రామస్తులు తెలియపరిచారు. విషయం తెలుసుకున్న దక్కిలి ఎస్ఐ శివశంకర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలియజేశారు. అనంతరం పార్థు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ నేతకు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి నివాళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నేత పాలపర్తి వెంకటేశ్వర్లుకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి శుక్రవారం నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు యశ్వంత్ కుమార్ తండ్రి పాలపర్తి వెంకటేశ్వర్లు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి దర్గామిట్టకు వెళ్లి పాలపర్తి వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అంతిమ సంస్కారాల కోసం రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈయన వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సరస్వతీ శిశు మందిర్‌కు నూతన కమిటీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ కు నూతన ప్రబంధకారిణి కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు గల్లా సురేష్, జిల్లా కార్యదర్శి రవికుమార్ హాజరై నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ... నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. కమిటీ సభ్యులు పాఠశాల మాతాజీలతో కలిసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. నూతన కమిటీ అధ్యక్షులు చాగణం భక్తవత్సలయ్య మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధి జరగాలంటే అందరి సహకారం ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల చదువు విషయం లో దృష్టి సారించడంలో తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమన్నారు. అందరం కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. పూర్వ వైభవం దిశగా పాఠశాలను నడిపిస్తామన్నారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు మంగిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాశంకర్, ప్రకాష్ సోమశేఖర్ రెడ్డి, పద్మావతి, పుష్పలత, డా.లక్ష్మీనారాయణ, రాజేష్ వర్మ, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, మాతాజీలు పాల్గొన్నారు.

పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.రమణ

విశాలాంధ్ర-దక్కిలి: పాఠశాలలు సెలవులు, వేసవి కాలం, పిల్లలు స్నేహితులతో కాలువలు చెరువులు బావిలలో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని తల్లి దండ్రులు పిల్లలపై జాగ్రత్త వహించాలని ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.రమణ ప్రెస్‌మీట్‌లో తెలియజేశారు. ప్రెస్‌మీట్‌లో మాట్లాడు తూ పిల్లలకు పరీక్షలు అయిపోయాయి. సెలవులు కావున పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవా లని, వేసవి కావడంతో స్నేహితుల తో కలిసి కాలువలు, చెరువులు, బావిలు, గుంటల్లో మునిగేందుకు (ఈతకు) పోయి ఈత రాక అందులో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘట నలు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు పిల్లల్ని ఒంటరిగా బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలకు ఈత నేర్పాలను కుంటె మీరు దగ్గర వుండి ఈతకు సంబంధించిన సేఫ్టీ పరికరాలను ఉపయోగించుకొని దగ్గరుండి ఈత నేర్పించాలని తెలియజేశారు. ఒంటరిగా పిల్లలను బయటకు పంపి వద్దని, తల్లి దండ్రులు పిల్లల పై జాగ్రత్త వహించాలని ప్రజలకు తెలియజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ సైట్ ప్రారంభం

విశాలాంధ్ర-పూతలపట్టు: మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థికరణాలు ఆన్లైన్ సైట్ ప్రారంభమైనది. ఏప్రిల్ 14వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు ఆన్లైన్లో అప్లై చేసుకోవచ్చు లబ్ధిదారుడు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి కుల ధృవీకరణ పత్రము కలిగి ఉండాలి. లబ్ధిదారుల వయోపరిమితి 21 సంవత్సరం నుండి 50 సంవత్సరాల వరకు ఉండాలి లబ్ధిదారుడు దారిద్ర రేకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉండాలి. స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి లబ్ధిదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. లబ్ధిదారునికి జనరిక్ ఫార్మసీ పథకాలకు డిఫాంసి, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ ఉండాలి. గత ఐదు సంవత్సరముల నుండి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంఎస్ ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి లోన్స్ మరియు బ్యాంక్ లింక్స్ స్కిమ్స్ తీసుకోకుండా ఆధార కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రము రవాణాకు సంబంధించిన అయితే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి . ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకున్న తర్వాత దరఖాస్తు ఫారం ను మీ సంబంధిత ఎంపీడీవో కార్యాలయం నందు దరఖాస్తు ఫారంతో పాటు మీయొక్క రేషన్ కార్డు కుల ధృవీకరణ పత్రము ఆధార్ కార్డు విద్యార్హత పత్రము మరియు పతకమునకు సంబంధించిన ఇతర పత్రములు రెండు సెట్ల జతచేసి ఇవ్వాలని. ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకున్నటకు గడువు ముగిసిన తర్వాత ఎంపీడీవో వారు ఇంటర్వ్యూ తేదీని నిర్ణయించి మీకు తెలియచేయబడును. తర్వాత ఇంటర్వ్యూ నందు లబ్ధిదారిని ఆరాధన బట్టి ఎంపిక చేయబడును.

గంగమ్మ ఆలయంలో ముగిసిన మహాకుంభాభిషేక వేడుకలు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం పీవీ పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న మహా కుంభాభిషేక వేడుకలు శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టిడిపి మాజీ అధ్యక్షుడు పరమశివం, పిచ్చాటూరు ఇలంగోవన్, బద్దురాజు తదితరులతో కలిసి కుంభాభిషేక వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గంగమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే పూజారులు పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. కుంభాభిషేకం చివరి రోజున ఆలయంలో తెల్లవారుజామున 3 గంటలకు యంత్ర ప్రతిష్ట పూర్తయిన తర్వాత గంగమ్మ,నాగాలమ్మ విగ్రహాలను ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. అలాగే గ్రామ నడిబొడ్డున శక్తి దేవతను ప్రతిష్ఠించి పూజలు జరిపారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచరణాల మధ్య ఈ పూజ క్రతువులను పూజారి షణ్ముఖ ఆచారి జరిపించారు. అనంతరం ఉదయము 6 గంటల నుంచి ఏడు గంటల లోపు హోమ మండపములో పూజలు నిర్వహించిన కలశాల జలాలతో శిఖర గోపురాలను,అమ్మవార్లను అభిషేకించి ప్రాణ ప్రతిష్ట గావించారు. ఈ క్రమంలో గ్రామంలోని భక్తులందరూ ఉదయం అమ్మవార్లకు అంబళ్లు పోసి పూజలు నిర్వహించడం జరిగింది. మహా కుంభాభిషేక వేడుకలు పురస్కరించుకుని ఏప్రిల్ 16,17,18 తేదీలలో మూడు రోజులు పాటు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శశిమోహన్ నాయుడు, మురళి(చికెన్ చిన్న), ధన శేఖర్, కొల్లడం రమణ, తులసిరామ్, గుర్రప్ప, స్థానిక నాయకులు పివిఎస్ఆర్ సుబ్రహ్మణ్యంరాజు, చంద్రమౌళి, ఉమా శంకర్రాజు, హరినాధ శెట్టి, నిరంజన్ కుమార్ భక్తులు పలువురు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల

వెయ్యి రోజుల సంరక్షణ పై అవగాహన

విశాలాంధ్ర-దక్కిలి: వెంకటగిరి ఐసి డిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాలలో సిడి పిఓ షంషాద్ బేగం పర్యవేక్షణలో ఈ నెల 8వ తేది నుండి 22 తేది వరకు జరుగుతున్న పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలో పల్లి వీధి, రాణి పేట అంగ న్వాడి కేంద్రా ల్లో సెక్టార్ సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో గర్భవతులకు బాలింతలకు, తల్లులకు,కిశోరి బాలకలకు పుట్టిన బిడ్డనుండి 1000 రోజుల సంరక్షణ అంశంపై అవగా హన కల్పించామన్నారు తల్లి గర్భ ధారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టి కాహారం, వైద్య పరీక్షలు గురించి గర్భవతులకు అందించే ఫోలిక్ యాసిడ్ మాత్రలను గురించి అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే పట్టాలని మరి ఇతర ఆహార పదార్థాలు గానీ ద్రపదార్థాలు గాని తినిపించవద్దని తెలియజేశారు. పుట్టిన బిడ్డకు టీకాలుతప్పని సరిగా వేయించాలన్నారు. ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల లోపు కీలకమని దశ కావున పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యక ర్తలు, గర్భవతులు, బాలింతలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

నూతన సబ్ డివిజన్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఎలమండ్యం వద్ద నూతనంగా నిర్మించిన రేణిగుంట సబ్ డివిజన్ నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే కు స్వాగతం పలికారు. అనంతరం నూతన భవనాన్ని ప్రారంభించి విద్యుత్ అధికారులతో, ప్రజా ప్రతినిధులతో రేణిగుంటలో విద్యుత్ వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, మండల సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, మునస్వామి నాయుడు, భాస్కర్ యాదవ్, పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-గంగవరం: మండలం చౌడిరెడ్డిపల్లి పంచాయతీలోని బత్తనపల్లెలో జరిగిన శ్రీరామ ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఆయన పాల్గొని స్వామివార్లను వేడుకున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే తో పాటు నాయకులకు గ్రామస్తులు ఘన స్వాగతం తెలియజేసి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాజీ సీఎం జగన్ మత విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు యం. సుబ్బయ్య హితవు పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీని ప్రజలు ఛీ కొట్టడంతో జగన్ తన ఉనికిని చాటుకోవడానికి మత రాజకీయాలకు తెరదీశారన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని హత్యగా చిత్రీకరించి క్రిస్టియన్లను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. తిరుమలలో గోవులు చనిపోయాయంటూ మరో కుట్రకు తెరలేపారన్నారు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్లో ద్వంద్వ వైఖరి అవలంబించి తిరిగి ముస్లింలను రెచ్చగొడుతుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైసీపీ నాయకులు కుట్రలు చేయడం చూస్తే ఊరుకునేది లేదని సుబ్బయ్య హెచ్చరించారు.

గంజాయి సమాచారం ఇవ్వండి

ఎస్.ఐ శివశంకర్

విశాలాంధ్ర-సోమల: సోమల మండలం లో గంజాయి ని పెంచడం గాని, అమ్మడం గాని, సేవించడం గాని నిషేధం అని ఎస్.ఐ. శివశంకర్ తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మండలంలో గంజాయిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పోలీసులు ముఖ్యమైన సెంటర్ లలో క్యూ ఆర్ కోడ్ ఉన్న గోడ పత్రిక ను అంటించారు. పెద్ద ఉప్పర పల్లి , నంజంపేట , సోమల, కందూరు లలో గల విద్య సంస్థలు వద్ద గోడ పత్రికలను సమాచారం కొరకు అంటించారు. ఎవరికైనా అనుమానం కలిగిన తమ మొబైల్ పోన్ సహాయం తో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసిన సమాచారం వెంటనే పోలీసులు కు చేరుతుందని ఆయన తెలిపారు. మండలం లో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకారాన్ని అందించి గంజాయి నిర్ములనకు కృషిచేయాలని కోరారు.

దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించాలి

- డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం పట్టంలో వ్యాపార సముదాయల ముందు ఆక్రమణలను తొలగించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ వ్యాపారస్తులకు పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దుకాణల వద్ద సిసి కెమెరా తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, కనీసం రెండు కెమెరా ఏర్పాటు చేయాలని అందులో ఒకటి రోడ్డు కనబడే విధంగా ఏర్పాటు చేయాలని, నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, ఆక్రమణలను వారం రోజుల లోపల తొలగించలని లేని యడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సిఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా గుడ్ ఫ్రైడే

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం లో శుక్రవారం నాడు క్రైస్తవులు గుడ్ ఫ్రైడే ను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సచివాలయ సమీపం లక్కనపల్లి రోడ్డులో ఉన్న కింగ్ ఫార్ట్ చర్చిలో ఫాదర్, మిషనరీ సిస్టర్స్, గ్రామ క్రైస్తవ ఆరాధకుల సమక్షంలో గుడ్ ఫ్రైడే ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పురవీధులలో యేసుక్రీస్తు శిలువను మోస్తూ కీర్తనలు పాడుకుంటూ తిరగడం జరిగినది. అనంతరం చర్చి నందు ప్రార్థనలు జరిపారు.

గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చ్‌లో ప్రార్థనలు

విశాలాంధ్ర-దక్కిలి: సెయింట్ ఫ్రాన్స్ స్ చర్చి నందు గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. శిలువ నెక్కి క్రీస్తు రక్తాన్ని చిందించిన రోజు గుడ్ ఫ్రైడే శుక్రవారం సెయింట్ ఫ్రాన్స్ చర్చ్‌లో ఫాస్టర్ బాల జోసెఫ్ ఆధ్వర్యములో జరిగింది. లోక రక్షకుడు యేసుప్రభువు చనిపోయినరోజు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటున్నా మని, ఈ సందర్భంగా క్రీస్తు బోధనలు ప్రార్థనలు చేశారు.

యాస్మిన్‌ను చంపిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు డిమాండ్

విశాలాంధ్ర-పూతలపట్టు: దేశంలో రోజురోజుకీ పరువు హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో మరణశిక్షను పడుతున్న లెక్కచేయకుండా మతం కారణంగా కులం కారణంగా బిడ్డలని కన్న తల్లిదండ్రులు చంపుకోవడం అటవీక చర్య అని బహుజన రాష్ట్ర అధ్యక్షులు చందు తెలిపారు. నేడు చిత్తూరు జిల్లాలో పూతలపట్టు మండలంలోని గ్రామములో సాయి తేజ అనే దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిని చిత్తూరు సంతపేటకు చెందిన యాస్మిన్ ను ప్రేమించి పెళ్లి చేసుకుని అబ్బాయి ఇంటి వద్ద కాపురం ఉన్నారని నెల రోజుల తర్వాత ఇది జీర్ణించుకోలేని అమ్మాయి కుటుంబ సభ్యులు అబ్బాయి ఇంటికి వచ్చి అమ్మాయి తండ్రికి బాగాలేదని కారులో తీసుకువెళ్లి కారులోనే అమ్మాయిని చంపేసి అమ్మాయి ఇంటికి యాస్మిన్ ని తీసుకుని వెళ్లి ఉరిగా చిత్రీకరిం చారని మీరు తెలిపారు ఈరోజు బహుజన చేన రాష్ట్ర అధ్యక్షుడు చందు దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ నాగరాజు వారి గ్రామానికి వెళ్లి వారి కుటుంబ కుటుంబాన్ని సందర్శించి జరిగిన సంఘటన వివరాలన్నీ తెలుసుకొని నిందితులకు శిక్షపడేంతవరకు పోరాటం చేస్తామని. భరోసా కల్పించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు కేసు విచారణ యాస్మిన్ భర్త సాయి తేజ దగ్గర కంప్లైంట్ తీసుకోకుండా చంపిన అమ్మాయి కుటుంబ సభ్యుల కోణంలో నుంచే ప్రవేశ విచారణ చేయడం విచారకరమని ఈ విధానం పలు అనుమానాలకు దారితీస్తుందని మీరు ఆవేదన చెందారు పోలీసు వారు వెంటనే అట్రాసిటీ కేసుగా నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చూపాలని మీరు డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ నాగరాజు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరములు పూర్తి కావస్తున్న దేశంలో కులవివేచ్ఛత తగ్గలేదని అన్నారు కూతురిని హత్య చేసిన దుర్మార్గుల్ని కఠినముగా శిక్షించకపోతే భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు మరింత పునరావతం అయ్యే ప్రమాదం ఉందన్నారు యాస్మిన్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం 21న అన్ని సంఘాలతో ఈ విషయాన్ని చర్చించి నిందితులకు చిచపడేంతవరకు పోరాటానికి రూపకల్పన చేస్తామని బహుజన సేన సభ్యులు తెలిపారు.

సరస్వతి కేఫ్ హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గంగవరం: మండలంలోని దండపల్లి రోడ్డు వై ఎస్ ఆర్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన సరస్వతి కేఫ్ హోటల్‌ను ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి బుధవారం హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి కి, పుష్ప గుచ్ఛం అందించి భారీ గజమాలతో, బాణాసంచా పేలుస్తూ మంగళ వాయుద్యాల నడుమ సరస్వతి కేఫ్ యాజమాని రూపేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గున్ని శుభాకాంక్షలు అందజేశారు. టిడిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని రూపేష్ కి శుభాకాంక్షలు తెలిపారు.

ఏప్రిల్ 21న ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-తడ: తడ మండల పరిధిలోని అక్కంపేట మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాలల)లో 6వ తరగతి ఎంట్రన్స్ ప్రవేశపరీక్ష ఈ నెల 21 సోమవారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. పరీక్ష వ్రాసే విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని ,హాల్ టికెట్ లో పొందుపరచిన సమయానికి పరీక్షకు హాజరు కావాలని హాల్ టికెట్ లో మీ ఫోటో లేకపోయినను ఆందోళన చెందవలసిన అవసరం లేదని,పరీక్షకు వచ్చేటప్పుడు 2పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు విద్యార్థి వెంట తెచ్చుకోవాలని అన్నారు.

నేడు ఘంటసాల స్వరనీరాజనం

విశాలాంధ్ర-తిరుపతి: ఘంటసాల గాన గౌతమి, భీమవరం, ఘంటసాల గానకళా పీఠం, తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాల స్వరనీరాజనం కార్యక్రమం ఈనెల 19వ తేదీ శనివారం సాయంత్రం మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తారని ఘంటసాల గాన కళా పీఠం అధ్యక్షుడు మల్లం విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 6:30కు తిరుపతి పుర ప్రముఖులచే సభా కార్యక్రమం, 7 గంటలకు సంగీత విభావరి ఉంటుందన్నారు. చిప్పాడ నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, ఉదయ భాస్కర్ రెడ్డి, నాయని మధు, శైలజ, అమృత ఈ సంగీత విభావరిలో ఘంటసాల ఆలపించిన అలనాటి మధుర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ముఖ్య అతిథులుగా మబ్బు సూర్యనారాయణ రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ జి భాను ప్రకాష్ రెడ్డి, నూకల శ్రీనివాసరావు, నవీన్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఈశ్వర ప్రసాద్, లోకనాథ్ రెడ్డి, భరత్ రెడ్డి, మహిధర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొంటారని వివరించారు. ఘంటసాల అభిమానులు, సంగీత ప్రియులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా అయితా మురళీకృష్ణ



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన అయితా మురళీకృష్ణను నియమించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ శుక్ర వారం ఈ నియామకపత్రాన్ని అయితా మురళీకృష్ణకు పంపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ... మహాసభ అభివృద్ధి, అమరావతిలో భవనం నిర్మించడానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆర్యవైశ్యులకు అవసరమైన సహాయం చేస్తానన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గతంలో పనిచేశానని అయితా మురళీకృష్ణ ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించడానికి సహకరించిన ఆర్య వైశ్య పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు.

మూడు పుస్తకాల ఆవిష్కరణ, సాహిత్య పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర-పలమనేరు: ఈ నెల 20న ఆదివారం ఉదయం పది గంటలకు హైదరాబాదు రవీంద్ర భారతిలో మూడు పుస్తకాల ఆవిష్కరణ, సాహిత్య పురస్కారం ప్రదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు మలిశెట్టి శ్యాంప్రసాద్, పలమనేరు రచయితల సంఘం అధ్యక్షులు పలమనేరు బాలాజీ ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీలో బహుమతి పొందిన కథలతో కథా ప్రపంచం 2024, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి నవల సాక్షాత్కారం, పలమనేరు బాలాజీ కవితా సంపుటి లోపలేదో కదులుతున్నట్టు మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం తోపాటు మలిశెట్టి శ్యాంప్రసాద్ స్మారక సాహిత్య పురస్కారాన్ని కథా రచయిత కవి జుజ్జురి వేణుకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పలమనేరు డిగ్రీ కళాశాలలో పనిచేసిన దివంగత కెమిస్ట్రీ లెక్చరర్ మలిశెట్టి సీతారాం స్మారకార్థం ప్రతి సంవత్సరం జాతీయస్థాయిలో కథల పోటీ నిర్వహిస్తున్నట్లు ఏడాదికి ఒకరికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నట్లు నిర్వాహకులు మలిశెట్టి శ్యాంప్రసాద్ తెలిపారు. కథల పోటీలో బహుమతి పొందిన రచయితలకు నగదు బహుమతితో పాటు సన్మాన కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపారు. సుప్రసిద్ధ సాహితీవేత్తలు వాడ్రేవు చిన వీరభద్రుడు విశ్రాంత ఐఏఎస్ అధికారి, యాకూబ్, ఎ.కె. ప్రభాకర్, తాయమ్మ కరుణ, విమల, కె.పి అశోక్ కుమార్ తదితరులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

మదర్ అకాడమీ స్కూల్లో

పెనుశిల నరసింహస్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-డక్కిలి: మదర్ అకాడ మీ పాఠశాలలో ఈ నెల 19వ తేది శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం జరుగు నని మధుర్ అకాడమీ కరస్పాండెంట్ తోటా రమేష్ తెలియజేశారు. వెంకటగిరి పట్టణంలోని మదర్ అకాడమీ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మదర్ అకాడమీ కరస్పాండెంట్ తోట రమేష్ మాట్లా డుతూ ఈనెల 19వ తేదీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం వెంకటగిరిలోని జరగనుందని, ఈ ఉత్సవం మదర అకాడమీ ప్రాం గణంలో 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ కళ్యాణోత్సవం లో భక్తులు పాల్గొని స్వామివారి కృపను పొందాలని మనసారా కోరు కుంటున్నామన్నారు. పెంచలకోన నుంచి ఉత్సవ విగ్రహాలను కాంపా ళెం మీదుగా పోలేరమ్మ ఆర్చ్, రాజా వీధి కాశీపేట, పాత బస్టాండ్ నుంచి మదరాకాడమీకి వస్తాయని, ఈ మార్గం మధ్యలో చిన్నారుల కోలా టాలు, నృత్యాలు ఉంటాయని తెలి యజేశారు ఈ కార్యక్రమాన్ని విజ యవంతానికి ప్రజలందరూ సహక రించాలని తెలిపారు. అనంతరం పలు విషయాలను మాట్లాడారు . ఈ కార్యక్రమంలో కార్యానిర్వాహ కులు తోట సరళ, సిహెచ్ ప్రభాకర్, ఓంకార్, పవన్ సాయి, వందన తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-గంగవరం: మండలంలోని కీలపట్ల రోడ్డులో నూతనంగా నిర్మించిన నేషనల్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా పలమనేరు శాసనసభ్యులు. ఎన్.అమరనాథ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కత్తరించి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల నుంచి ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా కృషి చేయాలన్నారు. అలాగే టెక్నికల్ కోర్సులు సంబంధించి పునాదిని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అందించాలని అవసరం ఉందని సూచించారు. నేషనల్ పబ్లిక్ స్కూల్ కరస్పాడెంట్ మరియు ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, ప్రెసిడెంట్ జగదీశ్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు సోమశేఖర్ గౌడ్, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, శ్రీధర్, కిరణ్ కుమార్, బిఆర్‌సి కుమార్, మురళి, ప్రతాప్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డిలతోపాటు స్కూల్ యాజమాన్యం శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-కోట: పరిశ్రమలలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి బి.హరీష్ పేర్కొన్నారు. కోట మండలం చిట్టేడు గ్రామంలోని జి.వి.ఆర్ రొయ్యల పరిశ్రమలో గురువారం కార్మికులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ప్రమాదం సంభవిస్తే మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేసేందుకు గల వివిధ పరికరాలను డెమో రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో వినయ్ నాగరాజు పి.సునీల్, శ్రీహరి, నరసింహం, వెంకట సుబ్బయ్య, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-వి. కోట: మండల పరిధిలోని కుమ్మర మడుగు వద్ద వి. కోట - పలమనేరు జాతీయ రహదారిపై శుక్రవారం అదుపు తప్పిన అగ్గిపెట్టెల లోడ్డు లారీ పాఠశాల ప్రహరీని ఢీకొని బోల్తా పడింది. తమిళనాడు నుండి ముంబైకి అగ్గిపెట్టెలను తీసుకెళుతున్న రాజస్థాన్ కు చెందిన లారీ కొమ్మరమడుగు సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న మలుపులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్ కు గాయాలు కాగా లారీలో ఉన్న పెట్టెలలోని అగ్గిపుల్లల రాపిడి జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అటవీశాఖ అధికారుల వైఫల్యం వల్లే చిరుత మృతి

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి మండలం పొన్నూటిపాలెం గ్రామంలో రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతంలో ఉచ్చులో చిక్కుకొని చిరుత మరణించడం, ఈ మరణానికి ఆ ప్రాంతంలో భూములు ఉన్న రైతులే కారణమని అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు కలసి రైతులని అరెస్టు చేయడాన్ని భారత్ కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఖండించింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు మాట్లాడుతూ చిరుత ఉచ్చులో చిక్కుకోవడం గమనించిన గ్రామస్తులు ఉదయం 8:00గంటలకు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చిన మధ్యాహ్నం 1:30వరకు చిరుతను కాపాడడంలో పూర్తిగా వైఫల్యం చెందారని, అటవీ శాఖ అధికారులు సమయానికి చిరు తకి ఉచ్చు తొలగించింటే చిరుత ప్రాణాలతో బయటపడేదని, అధికారులకు చేతగానితనం వల్లే చిరుత ప్రాణాలు కోల్పోయిందని ఆరో పణ చేశారు. అధికారులు చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం, రైతులు పైన కేసు నమోదు చేసి రిమాండ్ పంపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కోరేది ఏమంటే, చిరుత మరణంపైన సమగ్ర విచారణ జరిపించాలని, ఉచ్చును ఏర్పాటు చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ అరెస్టు చేసిన రైతుల్ని వెంటనే విడుదల చేయాలని, చిరుత చావుకు కారణమైన అటవీ శాఖ అధికారు లను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులు అవినీతికి పాల్పడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతు న్నాయని, అటవీ ప్రాంతాల్లో ఏం జరుగు తుందో ప్రతి ఒక్కటి ఆ ప్రాంతంలో ఉన్న అటవీ శాఖ అధికారులకు తెలుసని, వాట పైన అధికారులు ముందే ఎందుకు చర్యలు తీసుకోలేదని, అటవీ శాఖ అధికారులు అవినీతికి పాల్పడం వల్లనే ఇలాంటి ప్రమాదా లు జరుగుతున్నాయని ఆరోపణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

యువత మానవత దృక్పథాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-మదనపల్లె: నేటి సమాజంలో విద్యతోపాటు యువకులలో మానవ దృక్పథం సమాజం పై అవగాహన కలిగి ఉండడం యువకులు అలవరించుకోవాలని శుక్రవారం ఎస్వి, డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సందర్భం గా కరస్పాండెంట్ నాగ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సమాజంలో మానవ విలువలు మంట కలుగుతున్నాయని విద్యతోపాటు విలువల కూడా తమ జీవితాలలో రాణించాలని కోరారు విలువల కూడిన విద్యతో ముందుకు వెళితే సమాజంలో మంచి గుర్తింపు స్థిరమైన జీవితం ఏర్పడుతుందన్నారు. డిగ్రీ అనంతరం జీవి తంలో అనేక బాధ్యతలు ముందుకు వస్తాయని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం డి జమీర్ ఖాన్ డాక్టర్ ఈశ్వరయ్య ఆదినా రాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె పట్ట ణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో భక్తులు గుడ్ ఫ్రైడే ప్రార్థనలను జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన ఆలయమైన సిఎస్ఐ జెసిఎం చర్చిలో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ప్రత్యే క ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భ ంగా డేవిడ్ సంజయ్ కొయర్ బృందం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలను ఆకట్టు కున్నాయి. అనంతరం చర్చి పాస్టర్ డాక్టర్ రెవరెండ్ సునీల్ వరకుమార్ ప్రసంగిస్తూ మానవాళి పాపాలను పరిరక్షించేందుకే యేసు సిలువ మరణం చెందాడని తెలిపారు. ప్రభువును ఆరాధించిన ప్రజలే.. సిలువ వేయమని కర్కశంగా మాట్లాడారని, ఇది ప్రవచనాల నెరవేర్పులో భాగమని వివరిం చారు. యేసు సిలువపై పలికిన ఏడు మా టలను ప్రజలు అన్వయించుకుని సన్మార్గం లో జీవించాలని ఆకాంక్షించారు. భక్తులు ఉపవాసంతో చర్చ్ కు రావడంతో ప్రార్థనల అనంతరం భక్తులకు జ్యూస్ మజ్జిగ, ఫ్రూట్ సలాడ్‌లను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక ఆరాధనలో గురువులమ్మ లూ సి, సెక్రటరీ జేఊ భక్తవత్సలం, ట్రెజరర్ ఆ నంద్ కమిటీ సభ్యులు సూరి, జుగ్నూ, సుజా తదిన పాల్గొనగా జ్యూస్, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లను సర్పంచ్ మధు పర్యవేక్షించారు.

శిథిలావస్థకు చేరుకున్న జాతి సంపద

ఆదరణ కరువై దీనావస్థలో వారసత్వ కళాఖండాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: శత్రుదేశాల రాజులు మన దేశం పై దండెత్తి గుళ్ళు గోపురాలు కట్టడాలను ధ్వంసం చేసి అపారమైన సంపదను దోచుకోగా మిగిలిన శిథిలావస్థలో వున్న దేశ సంస్కృతి ని చాటే వారసత్వ సంపద అయిన కళాఖండాలు ను కాపాడటంలో పురావస్తు శాఖ నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుకొంది. ఆదరణ కరువవ్వటంతో అవి దీనావస్థలో పడ్డాయి. దేశ సంస్కృతికి నిదర్శనంగా నిలిచే పురాతన వారసత్వ కట్టడాలు, మండపాలు, గుళ్ళు ను కాపాడాల్సిన సంబంధిత పురావస్తు శాఖ నిర్లక్ష్యం, ప్రభుత్వాల వైఫల్యాలపై చరిత్రకారులు ధ్వజమెత్తుతున్నారు. భావితరాలకు దేశ సంస్కృతిని స్మరించుకొనే అవకాశమే లేకుండా చేస్తున్నారు. దేశం ఎంతగా నవీన నాగరికతను సంతరించుకుంటున్నా మన పురాతన సంస్కృతి నుంచే ఇవి పుట్టుకొచ్చినట్లు చారిత్రాత్మక కట్టడాలే నిదర్శనం. ప్రాచీన నాగరికత ఆధారంగానే జాతికి ఎన్నో ఉపయోగపడే ప్రయోగాలు, సంస్కరణలు నవీనయుగంలో జరిగినట్లు ఆధారాలున్నాయి. ఉదాహరణకు 1400 సంవత్సరాల క్రితం పల్లవ రాజు రెండవ నరసింహ వర్మ కర్ణాటకలోని తలగిరి లో శివాలయం నిర్మించారు. ఈ ఆలయ శిల్పా లలో కంప్యూటర్ కీ- బోర్డు తో సహా ఉన్న శిల్పం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మన పూర్వీకులు భవిష్యత్ ప్రపంచ అభివృద్ధిని ముందే ఊహించి మహాగ్రంథాలు, ఇటువంటి శిల్పాలు ద్వారా తెలియజేశారు. అది మన దేశ గొప్పతనం. రతనాలను రాశులుగా పోసి వీధుల్లో విక్రయించిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన చంద్రగిరి కోట, పురావస్తు శాఖ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకుంటున్నది. శ్రీ కృష్ణ దేవరాయలు రాయల కోటను రాజధానిగా చేసుకుని పరిపాలించిన కాలంలో రాజప్రసాదాల చుట్టూ నిర్మించిన శత్రు దుర్భేద్యమైన కోట గోడ ఉంది. ఈ కోట సుమారు ఐదు కిలోమీటర్ల మేర పొడవైనదిగా ఉంటుంది. నాయుడుపేట జాతీయ రహదారి పక్కనే ఉంటూ తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే కర్ణాటక తమిళనాడు, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుండి వాహనాల ద్వారా ప్రయాణించే యాత్రికులకు ఈ కోట గోడను చూడగానే కృష్ణదేవరాయల రాజ్యం గుర్తొస్తుంది. అలాంటి శత్రుదుర్భేద్యమైన కోట గోడ పై చెట్లు మొక్కల తో నిండి కనిపించక పోవటంతో యాత్రికులు నిరాశ చెందుతున్నారు. కొద్దిరోజుల తర్వాత మొక్కల వేర్లు పెద్దవై కోట గోడను పెకలించి శిథిలావస్థకు చేరుకునే ప్రమా దముంది. ఈ తరహా మొక్కలు, చెట్లను ప్రతియేటా జంగిల్ క్లియరెన్స్ ద్వారా తొలగించి కోటగోడ శు భ్రంగా కనిపించే విధంగా గతంలో ఉంచేవారు. ప్రస్తుతం నిధుల లేమి సిబ్బంది కొరత సాకు చూపుతూ వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటగోడ చుట్టూ శత్రుదేశాల సైనికులు దండెత్తడానికి వచ్చే సమయంలో అగర్తగా పిలవబడే స్థలంలో వర్షాకా లంలో నీరు చేరి అలాగే నీరు నిల్వ ఉండటంతో కోటగోడలు కూలిపోయే ప్రమాదం ఉంది. స్థానిక పురావస్తు శాఖ అధికారులు దీనిపై ఎలాంటి శ్రద్ధ చూపక పోవడం దురదృష్టకరం. పురావస్తు శాఖ చంద్రగిరి రీజియన్ కింద మండలంలో గుర్తింపు పొందిన మండపాలు, శిథిలమై ఉన్న దేవాలయా లు, జాబితా వీరి వద్ద లేకపోవడం విచారకరం. రాయల వారి కోట అనగానే పురావస్తుశాఖ దృష్టిలో రాజామహల్, రాణీమహల్ ప్రాకారాలే. ఈ ప్రాంతాలకు సమీపంలో ఉంటున్న శిథిలమై ఉన్న చారిత్రాత్మకమైన సంస్కృతికి నిలయమైన గోపురాలు ఆలయాలును పురావస్తు శాఖ పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం పర్యాటకులకు ఈ రెండు ప్రాకారాలే సందర్శించడానికి వీలుగా ఉన్నప్పటికీ రాణీమహల్ గా పిలవబడే గుర్రపుశాల మూసివేసి సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆ ప్రాకారం మరమ్మతులకు నోచుకోక (రాణీమహల్) సందర్శ కులను అనుమతించకపోవడంతో పర్యాటకులు ఉసూరుమంటూ వెళుతుండటం విచారకరం. కృష్ణదేవరాయల కాలంలో ఆస్థాన కవిగా పేరు పొందిన తెనాలి రామకృష్ణుడు కి చెందిన గృహం గా పిలవబడే రాజా మహల్ కు అతిసమీపంలో ఉంటున్న శిథిలమైన మట్టి గోడలను పరిరక్షించ లేకపోవటం దురదృష్టకరం. రాయల కోట ప్రాంగ ణంలో ఉండే ప్రసిద్ధి చెందిన కోనేరు పాచి పట్టి ఉన్నప్పటికీ కోనేరును శుభ్రపరచక పచ్చగా దుర్వాసనతో పర్యాటకులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి. రాయల కోట చుట్టూ ప్రకారం గా ఉండే ఈ గోడలు పై అప్పట్లో శత్రువులు దండెత్తి వస్తున్న సమయంలో బురుజులు పై నుండి మన సైనికులు నిలబడి వారిని తరిమి తిప్పి కొట్టే వారని కోటకు ముందు అగారొత్తులు అంటే శత్రు సైనికులు ముందు నీళ్ళలో దిగి రావాల్సి ఉంటుంది. అలాం టి అగర్తలు నేడు అన్యాక్రాంతం అయ్యి రూపు రేఖలు కనిపించలేదు. ప్రస్తుతం బురుజులు జాడే కానరావటం లేదు. గతంలో శిథిలమైన కోట గోడ, గోపురాలు పాడుబడిన ఆలయాలను మరమ్మతుల కోసం పురావస్తుశాఖ నిధులు మంజూరు చేస్తూ ఉండేది. ఈ నిధులతో ఆ శాఖ అధికారుల ద్వారానే మరమ్మతులు చేస్తూ ఉండేవారు. ఈ మరమ్మతుల కోసం కేంద్ర పురావస్తు శాఖ టెండర్ల ప్రక్రియ గురించి స్థానికులకు ఎలాంటి సమాచా రం ఇచ్చేవారు కాదు. మరమ్మత్తులు, పునః నిర్మా ణాల కోసం అంచనాను అధికారులే వేసేవారు. పనులను అధికారులే చేపట్టడం వలన భారీ ఎత్తున లబ్ధి పొందుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. రాయల కోటకు ఉత్తరాన దుర్గం ఉన్నది, దుర్గం కొండ పై అపారమైన కళా ఖండాలు, మండపాలు ఉన్నాయి. కొండపై ఉన్న మండపాలు నిఘాలేకపోవటంతో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపి అవి శిథిలావస్థలో పడి ఉన్నాయి. దుర్గం కొండ పైకి వెళ్ళడానికి మెట్లను మరమ్మ తులు చేయకపోవడం ఒక కారణమైతే రహదారిని తీర్చిదిద్దితే గుప్త నిధుల కోసం వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని ఆ రహదారి మరమ్మతు లకు నోచుకోక పర్యాటకులు వెళ్ళలేని పరిస్థితి. కోట నిర్మాణ దశలో నిర్మాణానికి అవసరమైన నీటి సదుపాయం కోసం కోట చుట్టూ బావులను నిర్మిం చారు. పురావస్తు శాఖ పర్యవేక్షణ లేక ప్రస్తుతం ఆ బావుల్లో కొన్ని ఆక్రమణలకు గురి కాగా మరికొన్ని బావులు జాడే లేకుండా పోయాయి. శ్రీకృష్ణదేవ రాయల కాలంలో స్వామివారికి నైవేద్యము ఇవ్వటా నికి ముందుగా కోట వద్ద గల గంటా స్తంభంగా పిలవబడే ప్రదేశంలో ఓ గంట వాయించేవారు, ఆ గంట కొడితే రెడ్డివారి పల్లి వద్ద గల ఆలయం వరకు వినిపించగా అక్కడ మరో గంట మోగించే వారు, ఆ గంట తిరుమలకు వినబడితే అక్కడ స్వామివారికి నైవేద్యం సమర్పించే వారు అన్నట్లు సమాచారం. ప్రస్తుతం రెడ్డివారి పల్లి లో ఉన్న ఆ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది.పిఎన్ రహదారి పక్కనే తొండవాడ పంచాయతీ పరిధిలో మరో ప్రసిద్ధిగాంచిన తిమ్మాపురం ఆలయం కలదు. ఆలయం చుట్టూ శిల్పులు తమ నైపుణ్యాన్ని ఉప యోగించి అతి సుందరంగా తీర్చిదిద్దబడి ఒకప్పు డు ప్రసిద్ధి దేవాలయంగా పేరు పొందిన ఆ దేవాల యానికి అప్పట్లో మాన్యం భూములు కేటాయించి సమీపంలోని అగ్రహారం గ్రామం లోని బ్రాహ్మణు లకు నైవేద్యాల కోసం కేటాయించినట్లు సమాచా రం. ఆ ప్రదేశం ప్రస్తుతం అగ్రహారం బ్రాహ్మణులు ఇతరులకు విక్రయించేసారు. కేవలం మిగిలి ఉన్న శిథిలావస్థలో ఉన్న ఆలయం ఆదరణ కరువైంది. తొండరలో కబ్జాదారులు ఆలయాన్ని కూడా పెకి లించి ఆ స్థలాన్ని కూడా ఆక్రమణ చేసుకునే క్రమంలో ఉన్నారు. కూతవేటు దూరంలో పురావ స్తుశాఖ కార్యాలయం ఉన్నప్పటికీ నిమ్మకు నీరెత్తి నట్లు అధికారులు వ్యవహరిస్తుండటం శోచనీయం. స్థానిక పురావస్తు శాఖ అధికారి (సి.ఎ) పర్యవేక్షణ లేకపోవడంతో సదరు అధికారి కార్యాలయంలో వుండగానే రాజామహల్ ప్రాంగణం యధేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. సిబ్బంది చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతో స్థానికులు విరుచుకుపడుతున్నారు. వీటి అన్నిటికీ ఆ అధికారి ఇస్తున్న సమాధానం ఒక్కటే సిబ్బంది కొరత. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ మన జాతి సంస్కృతిని చాటే సంపదను కాపాడుకోడానికి కేంద్ర ప్రభుత్వం పురావస్తు శాఖకు పుష్కలంగా నిధులు మంజూరు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇది ఇలా ఉండగా రాయల కోట సందర్శకుల కోసం సందర్శకులను విశేషంగా ఆకర్షించేకోటానికి అప్పట్లో మూడు కోట్లు రూపాయలు వెచ్చించి నిర్మించిన లైటింగ్ షో భారీ వర్షాల కారణంగా దెబ్బతిని మూతపడింది. ప్రస్తుతం లైటింగ్ షో లేని కారణంగా పర్యాటకులు అంతంత మాత్రమే వస్తుండటం విశేషం. కోట కు వెళ్లే రహదారిలో వీధిలైట్లు సైతం ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఉన్న లైట్లు వెలగక రహదారి అంతా కారు చీకట్లు అలుము కొని రాత్రిపూట ఈ రహదారి నుండి వెళ్లటానికి పర్యాటకులు భయాందోళనకు గురవుతున్నారు. పరిస్థితి మరీ దారుణంగా వున్నా అధికారుల్లో మాత్రం స్పందన లేదు.లి ఏది ఏమైనా ప్రపంచానికి ఉపయోగపడే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం మనదేశ ప్రాచీన శిల్పాలు, గ్రంథాలల్లో నిక్షిప్తమై ఉన్నాయన్నది జీవిత సత్యం.



ఆర్థిక సంఘానికి వీడ్కోలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లాలో 2 రోజుల పర్యటన అనంతరం శుక్రవారం ఉదయం ఢిల్లీకి తిరుగు పయనమైన 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా. అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మ్యాథ్యూ, డా. మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృత, ఆదిత్య పంత్ తదితర సభ్యులతో కూడిన బృందానికి రేణిగుంట విమానాశ్రయం నందు సాదర వీడ్కోలు లభించింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ పీయూష్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత లైజన్ అధికారులు తదితరులు 16వ ఆర్థిక సంఘ సభ్యులకు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ పీయూష్ కుమార్, జిల్లా కలెక్టర్ లతో కలిసి ఎంతో ప్రసిద్ధి గాంచిన శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్ నందు తయారు చేయబడిన పెద్ద కలంకారి క్యాన్వాస్ ను అందించారు. అలాగే జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్ వాటి ప్రాశస్త్యాన్ని జిల్లా కలెక్టర్ కమిషన్‌కు వివరించారు. అంతకు మునుపు శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్, సభ్యులు సుప్రభాత సేవలో సేవించుకుని దర్శించుకున్నారు.

టిటిడి నిత్య అన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలు వితరణ

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు పట్టణ కూరగాయల మార్కెట్ ఓకెఆర్ మండి యజమాని రెడ్డప్ప రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల కూరగాయలను తన సొంత నిధులతో శనివారం పంపించారు. ఈ సందర్భంగా రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ పలమనేరు కాపు పల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కూరగా యలను స్వామివారి నిత్యాన్నదానానికి పంపించడం తమకు ఎంత ఆనందంగా ఉందని స్వామివారి సేవ చేసుకునే భాగ్యం దొరికినందుకు తమ జన్మ ధన్యమైందని ఆనందాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు కాపుపల్లి రవీంద్రారెడ్డి మిత్ర బృందం కిషోర్ స్వామి, సోమశేఖర్ నాయుడు, బాబు, చేగు రాఘవయ్య శెట్టి, విజయలక్ష్మి కళ్యాణ మండపం అధినేత సుంకు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, జనార్ధన్

విశాలాంధ్ర-పూతలపట్టు: కాణిపాకం స్వయంబు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారిని పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకు న్నారు. శుక్రవారం మధ్యాహ్నం కానుపాక ఆలయం వద్దకు చేరుకున్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్‌కి ఒంగోలు శాసనసభ్యులు దామర చర్ల జనార్ధనకి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ఏద ఆశీర్వదం మండపంలో వీరికి వేద పండితుల చేత వేద ఆశీర్వచనం అందించగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వామివారి పట్టు వస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని తీర్థప్రసా దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండల టిడిపి అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్ మని నాయుడు, టిడిపి నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలలో 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారమైన ఏప్రిల్ నేడు తిరుమలలో సామూహిక శ్రమదానాన్ని టీటీడీ నిర్వహించనుంది. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రోడ్లపై చెత్తను తొలగించి శుభ్రం చేయనున్నారు. అలిపిరి నడక దారిలోని కుంకాల పాయింట్ (ఆఖరి మెట్టు) వద్ద నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

మే 11 నుండి 19 వరకు న్యూఢిల్లీలో శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి: న్యూఢిల్లీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. మే 10న సాయంత్రం అంకురార్పణం జరుగనుంది. బ్రహ్మోత్సవాల ముందు మే 6వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తారు. మే 11వ తేదీ ఉదయం 6 నుండి 8.07 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించను న్నారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహన సేవలు జరుగనున్నాయి. మే 20వ తేదీన సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు: 11-05-2025 ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం. 12-05-2025 ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం. 13-05-2025 ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం. 14-05-2025 ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం. 15-05-2025 ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం. 16-05-2025 ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనం. 17-05-2025 ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం. 18-05-2025 ఉదయంరథోత్సవం, రాత్రి అశ్వ వాహనం. 19-05-2025 ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం.

ఈ-వేస్ట్‌ను ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో అందించండి

కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి: నగరంలో ప్రతి ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఉత్పత్తి అయిన ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వస్తువులు) ను రాయల్ నగర్ నందు ఏర్పాటు చేసిన ఆర్.ఆర్.ఆర్ సెంటర్ నందు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ప్రతి మూడవ శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ తెలిపారు. ఈ నెల ఈ-వేస్ట్ నిర్వహణ, సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ-వేస్ట్ సేకరణ నగరంలోని న్యూ బాలాజి కాలని అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద వద్ద ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు సేకరిస్తామని తెలిపారు. ఎలక్ట్రికల్ వస్తువులు అయిన కంప్యూటర్లు, బ్యాటరీలు, సెల్లులు, ఎలక్ట్రికల్ ఫోన్ తదితర వస్తువులు అన్ని ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద ఇవ్వ వచ్చునని అన్నారు. నగరంలో ఉత్పత్తి అవుతున్న ఈ-వేస్ట్ సేకరణ, నిర్వహణపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు పాత మునిసిపల్ కార్యాలయం నుండి శ్రీదేవి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ - వేస్ట్ అంటే ఏంటి, ఏ ఏ వస్తువులు ఉంటాయి, వాటి సేకరణ, నిర్వహణపై శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద అవగాహన కల్పిస్తామని అన్నారు. నగరంలో సేకరించిన ఈ వ్యర్థాలను బెంగళూరు పంపి వందశాతం నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవగాహన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, దుకాణ దారులు పాల్గొని విజయవంతం చేయాలనే కోరారు.

ప్రతిభను చాటిన మంగళపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర-చిత్తూరు: పై విలువను 3600 దశాంశాలు చెప్పి మంగళపల్లి విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని విజయం ఎంబీఏ కాలేజీ నందు జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం, పాపు దేసి ఫౌండేషన్, లైన్స్ క్లబ్ గోల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళపల్లి విద్యార్థులచే గణితములో గల పై విలువలను 3600 దశాంశ స్థానాలను తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి విద్యార్థుల ప్రతిభను చూసి అబ్బురపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఇలా 'పై' విలువను తెలియజేయడం రాష్ట్రంలోనే తొలిసారి అని వారి ప్రతిభను కొనియాడారు .9వ తరగతి చదువుతున్న లహరి గణితంలో గల పై విలువను మొదటి దశాంశము నుండి 1000 దశాంశం వరకు నాలుగు నిమిషాల 58 సెకండ్లలో తెలియజేసింది. పదో తరగతి చదువుతున్న పునీత్ సాయి 1001 వ దశాంశము నుండి 2000 దశాంశ స్థానాలను ఏడు నిమిషాల 52 సెకండ్లలోనూ అదే తరగతికి చెందిన హేమ 2001వ దశాంశము నుండి 3వేల దశాంశాల వరకు గల విలువలను ఎనిమిది నిమిషాల 12 సెకన్ల లోను రేవతి 3000 నుండి 3600 దశాంశ స్థానాలకు తెలియజేసి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమసంధానకర్త, గణిత అవధాని, ఏపీ ఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులైన హెచ్.అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన కొద్దీ విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి కూడా పెంపొందించాలని జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవడం ఎలాగో తెలుసుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని ఒకే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఈరోజు పై విలువను 3600 దశాంశాలకు చెప్పడం అద్భుతమని వారి ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విజయం విద్యా సంస్థల అకాడమీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజ మూర్తి మాట్లాడుతూ ఈ విద్యార్థులు ఒక్కొక్కరు 1000 సంఖ్యలను గుర్తుపెట్టుకుని చెప్పడము నన్ను మంత్రముగ్ధుల్ని చేసిందని వీరు ఇంటర్ విజయం విద్యా సంస్థల్లో చేరితే ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. లైన్స్ క్లబ్ గోల్డ్ చిత్తూరు నగర అధ్యక్షుడు ఎం.వి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వీరి ప్రతిభ అసాధారణమని ఈ పై విలువ ప్రపంచ రికార్డు అయ్యే అవకాశం ఉందని అందుకు అయ్యే ఖర్చులను లైన్స్ క్లబ్ గోల్డ్ భరిస్తుందని తెలియజేశారు. కార్యక్రమములో జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్, విజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఎం చంద్రమ నాయుడు, పాపు దేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి, కే. గొల్లపల్లి ప్లస్ స్కూల్ హెడ్ మిస్ట్రెస్ లలిత, మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మిస్ట్రెస్ రాజ్యలక్ష్మి, లైన్స్ క్లబ్ గోల్డ్ మనోహర్, జమీర్, జై కుమార్, సబిత, భారతి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ అవార్డు గ్రహీత హరీష్ తదితరులు పాల్గొన్నారు.